# పాపం పండిన వేళ

"మీనా, స్టార్టెడ్ ఫస్ట్. నో ఇన్‌ఫర్‌మేషన్. వైర్ ఇమీడియట్లీ" అని మామగారిచ్చిన టెలిగ్రామ్ చదివి షాక్ కొట్టినట్లు అయి కేలండర్ వైపుకి చూసాడు అనిల్. ఈ రోజు పదవ తేదీ. అనిల్ శరీరానికి ఒక్కసారిగా కరెంటు తీగ తగిలినట్లు వణకసాగాడు.

'రెండో తేదీని ఢిల్లీకి చేరిన మీనా ఇంతవరకు ఇంటికి రాలేదు! ఏమయిపోయింది?' అన్న ఆలోచన రాగానే కంగారు పుట్టి, చమటతో శరీరమంతా తడిసిపోసాగింది. గుండె దడదడ కొట్టుకుంటోంది. ఆందోళనతో క్షణక్షణానికీ బి.పి. పెరిగిపోతోంది.

'ఇప్పుడు ఏం చెయ్యాలి? ఎవరినడగాలి? ఏమని రిపోర్టివ్వాలి?' అని ఆలోచిస్తూ ఏమీ తోచక స్కూటర్ తీసి రైల్వే స్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడ గేటు దగ్గర టిక్కెట్టు కలెక్టు చేసే వ్యక్తిని అడిగితే "వారం రోజుల క్రితం విషయాలు ఎవరికి గుర్తుంటాయండీ?" అన్నాడు.

ప్రయోజనం లేదని తెలిసినా, పిచ్చివాడిలా అక్కడ కనపడ్డ ఆఫీసర్లనల్లా అడిగాడు. ఆఖరికి తెలిసిన విషయం ఏమిటంటే ఆ రోజు ఉదయం రావలసిన రైలు మధ్యలో గూడ్సు రైలు పడిపోవడం వల్ల రాత్రి పదింటికి వచ్చిందన్న విషయం మాత్రమే! ఆ తరువాత ఏం చెయ్యాలో తోచని అనిల్ తిన్నగా పోస్టాఫీసుకి వెళ్ళి, మీనా తల్లిదండ్రులకు ఈ విషయం వైరిచ్చి ఇంటి కొచ్చాడు.

మంచంమీద పడుకున్న అనిల్ మనసు అశాంతితో కొట్టుకోసాగింది.

అనిల్ మీనాల వివాహమయి అయిదు నెలలు కూడా కాలేదు. కాపరానికొచ్చేటప్పుడు ఇద్దరూ కలిసి వచ్చారు. నాగపూర్‌లో పుట్టి పెరిగిన మీనాకి ఢిల్లీ కాపరం ఏమంత కొత్తనిపించలేదు. ముఖ్యంగా ఆమెని భర్త ఎంతో ప్రేమగా చూసుకోవడంతో ఆమెకి ఢిల్లీ జీవితం సరదాగానే ఉండేది. హిందీ కూడా బాగా రావడంతో వచ్చిన కొద్ది కాలానికే ఢిల్లీ అంతా వంటరిగా తిరగ్గలిగేది.

మీనా బామ్మకి చాలా సుస్తీగా వుందని, మనుమరాలిని చూడాలంటోందని మామగారు రాసిన ఉత్తరం చూసి మీనాని పంపించాడు అనిల్. అక్కడ నెల్లాళ్ళు వున్న మీనా వేసవి శలవుల వల్ల రిజర్వేషన్ దొరకడం కష్టంగా వుందని, రిజర్వేషన్ దొరకగానే వైరిస్తానని రాసిన ఉత్తరం అంది, ఆ వైర్ కోసం ఎదురుచూస్తున్న అనిల్‌కి, ఆ వైరు రాలేదు సరికదా, ఈ వైరు అంది – "ఇలా జరిగిందేమిటి? ఏదన్నా అఘాయిత్యం జరగలేదు కదా!" అన్న ఆలోచనతో కలవరపడసాగాడు.

ఏదో ఆలోచన వచ్చి వారం, పది రోజుల పేపర్లు తీసి హత్యలు, ప్రమాదాలు వున్న వార్తలన్నీ చూసాడు. ఎక్కడా అలాంటి వార్తలు కనపడలేదు. మళ్ళీ లేచి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి "రెండో తారీఖునా, ఆ తరువాతా ఏమన్నా హత్యలు, ఏక్సిడెంట్లు జరిగాయా?" అని అడిగాడు. ఇన్స్‌పెక్టరు రిజిష్టరు చూసి, ఏవేవో చెప్పాడు. అందులో ఆడ పేరు ఒక్కటీ లేదు.

ఇంటికొచ్చిన అనిల్‌కి ఏంచెయ్యాలో తోచటం లేదు. తల నిండా పిచ్చి పిచ్చి ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి. "మీనా ఏమయివుంటుంది? ఎక్కడికెళ్ళి వుంటుంది?" అన్న ఆలోచనలతోపాటు ఏదో ఆలోచన, సందేహం వచ్చి, కాసేపు 'అవును... కాదు' అని తనలోనే తర్కించుకుని 'అవును' అదే జరిగి వుండొచ్చు... ' అని అనిపించింది.

అవును నిజమే! రిజర్వేషన్ కాగానే వైరిస్తానన్న మీనా వైరివ్వకుండా ఎందుకు బయలుదేరుతుంది? ఇందులో ఏదో తిరకాసు వుంది! చదువుకున్నది, హిందీ వచ్చింది, ఢిల్లీలో దిగి రాలేనంత తెలివితక్కువదేం కాదే! ఎన్నిసార్లు రైల్వేస్టేషన్‌కి వెళ్ళి ఫ్రెండ్సుని, చుట్టాలని రిసీవ్ చేసుకుంది మీనా! పైగా ఈ నాలుగు నెలలుగా కనిపెట్టిందేమిటంటే ఆడా, మగా అన్న భేదం లేకుండా తన స్నేహితులందరితో కూడా చాలా అనువుగా జోకులేస్తూ కబుర్లు చెబుతుందన్నది. రెండు మూడు సార్లు తను ఆఫీసు నుంచి వచ్చేసరికి తన స్నేహితులొచ్చివుంటే వాళ్ళతో నవ్వుతూ, జోకులేస్తూ కబుర్లు చెప్పడం చూసాడు. నార్తులో పెరిగిన పిల్లకదా అని తన దురాలోచనకి తనే తిట్టుకున్నాడు. ఇప్పుడివన్నీ ఆలోచిస్తుంటే వైరివ్వకుండా బయలుదేరడానికి కారణం ఏదన్నా వుందేమో! అన్న సందేహం వస్తోంది. నాలుగైదు నెలల్లో ఆడదాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం అనుకున్నాడు. ఈ ఆలోచనతో అంతవరకూ వున్న ఆందోళన చప్పుగా చల్లారిపోయింది.

అనిల్ వైరందుకున్న మీనా తల్లిదండ్రులు లబో, దిబోమంటూ ఢిల్లీకి పరుగెత్తుకు వచ్చారు.

"మీనా వైరివ్వకుండా ఎందుకు రైలెక్కింది" అని అత్తమామల్ని బయటే నిలేసి, అడిగాడు అనిల్.

"అకస్మాత్తుగా రిజర్వేషన్ దొరికింది, నాకు భయం లేదు వెళ్ళిపోగలను అని మొండిగా బయలుదేరింది బాబూ!" అంటూ వాళ్ళు చెప్పిన దానికి "కనీసం మీరన్నా ఎందుకు టెలిగ్రాం ఇవ్వలేదు?" అని అడగ్గానే "నిజమే బాబూ! పొరపాటే జరిగింది. పిల్ల తెలివైనదే కదా! అనుకున్నాం. పైగా "ఇల్లు బాగా తెలుసు. సడెన్‌గా వెళ్ళి ఆయన్ని సర్‌ప్రయిజ్ చేస్తా నాన్నా!" అనడంతో వూరుకున్నాం. ఏమిటో మాఖర్మ పిల్ల ఏమయిపోయిందో!" అంటూ గోలపెడుతున్న అత్తమామల్ని చూసి వెటకారంగా నవ్వాడు.

"ఏమీ అవలేదు. ఎక్కడికో తన బాయ్ ఫ్రెండ్‌తో వెళ్ళి హాయిగా వుండి వుంటుంది లెండి... అందుకే మీ దగ్గరా, నా దగ్గరా అలా నాటకం ఆడింది. బాధపడకండి!" అంటూ విసురుగా బైటికెళ్ళిపోయాడు.

పెళ్ళయిన ఈ కొద్ది నెలల్లోనే మీనాని ప్రాణంకంటే అధికంగా ప్రేమించాడు అనిల్. ఏ విషయానికీ అడ్డు చెప్పలేదు. ఆమె అడిగిందేదీ కాదనలేదు. ఆమె మీద అభిమానంతో పాటు నమ్మకాన్ని కూడా పెంచుకున్నాడు. ఎప్పుడూ ఆమె గురించి చెడు ఆలోచన రానీయలేదు. కానీ ఈ రోజెందుకో మీనా ప్రవర్తనలో అంతా చెడే కనిపిస్తోంది. ముఖ్యంగా "ఉత్తరం రాయకుండా ఎందుకు బయలుదేరింది?" అన్నదే అనిల్ సందేహం. చదువుకునే రోజుల్లో ఎవర్నో ప్రేమించి వుంటుంది. ఇప్పుడీ అవకాశం చూసుకుని వాడితో వుడాయించి వుంటుంది..." అనుకున్నాడు. ఈ అనుమానపు పురుగు బుర్రలో ప్రవేశించగానే మీనా అంటే అసహ్యం పుట్టింది అతనికి.

"నా భార్య లేచిపోయింద"న్న అవమానాన్ని మనసులో నింపుకుని స్నేహితుల దగ్గర, తోటి ఉద్యోగస్తుల దగ్గర తలెత్తుకుని తిరగలేక మొహం తప్పించుకుని తిరిగేవాడు. ఎవరన్నా మీనా గురించి అడిగితే మాట తప్పించి అక్కడి నుంచి వెళ్ళిపోయేవాడు. అంతే కాకుండా అతనికి ఆడవాళ్ళంటేనే అసహ్యం పుట్టింది. 'ఆడవాళ్ళంతా మోసగాళ్ళు' అన్న భావాన్ని పెంచుకుని, జుగుప్సతో వాళ్ళవైపు చూసేవాడు. ఆఫీసులో ఆడవాళ్ళు చనువుగా పలకరిస్తే చులకనగా మాట్లాడి, హేళన చేసి తన కసినంతా మాటల్లో కలిపి మీనా మీద కోపం, కసిని చల్లార్చుకోడానికి ప్రయత్నించేవాడు.

కాలం గడిచిపోతోంది. తల్లిదండ్రులెంత బ్రతిమాలినా మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి అనిల్ ఒప్పుకోలేదు.

అనిల్ స్నేహితుల్లో ముఖ్యుడు, ప్రాణమిత్రుడు కపూర్. ఢిల్లీ వచ్చినప్పటి నుంచే కాకుండా, వాళ్ళ పెళ్ళయ్యాక కూడా వాళ్ళ కుటుంబంలో ఒకడుగా వుండేవాడు. ఈ సంఘటన తరువాత అతను అనిల్‌ని మామూలు మనిషిగా మార్చాలని చాలా ప్రయత్నించేవాడు. కపూర్ ఇంకా బ్రహ్మచారే కావడంతో ఖాళీ టైములో ఎక్కువ కాలం అనిల్‌తోటే గడిపేవాడు. కపూర్‌తో కలిసి తిరుగుతూ అనిల్ పాత జ్ఞాపకాలని మరిపించడానికి ప్రయత్నించేవాడు.

"అరే భాయి! తొందరగా కరోల్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కి రా... నీతో అర్జంటు పనుంది.." అన్న కపూర్ ఫోన్‌కాల్‌కి అనిల్ మేనేజర్‌కి చెప్పి, స్కూటర్‌ని కరోల్‌బాగ్ వైపుకి స్పీడుగా పోనిచ్చాడు.

ఈ మధ్యనే కపూర్‌కి పోలీస్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం వచ్చింది. నాకూ పోలీస్ స్టేషన్‌కి సంబంధం ఏమిటి? నన్నెందుకు పిల్చాడు? అని ఆశ్చర్యపోతున్నాడు అనిల్.

పోలీస్‌స్టేషన్ లోపలికెళ్ళిన అనిల్‌ని కపూర్ లోపలికి తీసుకెళ్ళి ఏదో హడావిడిగా చెప్పసాగాడు. అది విన్న అనిల్ నోట మాట రాక నిశ్చేష్టుడయ్యాడు.

"అనిల్! నీ స్కూటర్ ఇక్కడుంచి నాతో రా...నే చెప్పింది నిజమో కాదో చూడు. తరువాత కర్తవ్యం ఆలోచిద్దాం!" అంటూ అనిల్ చెయ్యి పట్టుకుని ఆటో వైపుకి లాక్కెళ్ళాడు కపూర్.

ఆటోలో కూర్చున్న కపూర్ ఆర్.కె. పురం చలో అన్నాడు. అనిల్ దృష్టంతా ఆటోవాడిపైనే వుంది.

అనిల్ ఇంటి ముందు ఆటో ఆపించి, "పావుగంటలో వస్తాం, మళ్ళీ కరోల్‌బాగ్‌కి తీసుకెళ్ళాలి... వెయిటింగ్ డబ్బులిస్తాం..." అంటూ లోపలికెళ్ళారు ఇద్దరు.

"ఏమంటావు భాయి! ఆ ఆటోవాడు మెడకి చుట్టుకున్న చీరముక్క భాబీజీదే కదూ?" అడిగాడు కపూర్.

"అలాంటి చీరలు ఎన్నో వుంటాయి. అది మీనాదే అని ఏమిటి? అయినా నీకదేం గుర్తు?" అన్నాడు అనిల్.

"చూడు భాయీ! నేను చేస్తున్న ఉద్యోగమేమిటనుకున్నావు? ఇలాంటివి పసికట్టడమే మా పని. ఇంక ఆ చీరెలా గుర్తుంటావు! చెప్పనా? ఓ రోజు మనం ముగ్గురం సినీమా నుంచి వస్తుంటే భాబీజీ షోరూంలో ఆ చీర చూసి బాగుందనగానే మనం షాపులో కెళ్ళి కొనడం నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేదు. ఇంకా వివరంగా చెప్పనా? ఆ చీరను కాష్మీర్ ఎంపోరియంలో రెండు వందల యాభైకి కొన్నావు. ఒప్పుకుంటావా? ఇంక ఆ చీర భాబీజీదే అనడానికి నిదర్శనం చీర కొసన మీ చాకలి గుర్తుంది. మీ ఇంట్లో చాలా బట్టలమీద అదే గుర్తు చూసాను. ఇవన్నీ మా పోలీస్ డిపార్ట్‌మెంటు వారే కనిపెట్టగలరు. పదపద ఇంక ఆలస్యం చెయ్యకు" అంటూ ఫోన్ దగ్గరకెళ్ళి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసి వివరాలన్నీ చెప్పి ఆటో నెంబరిచ్చి వెంటనే రమ్మన్నాడు కపూర్.

మరో పావుగంటలో జీప్‌లో వచ్చిన పోలీసులు ఆటోవాడిని పట్టుకుని స్టేషన్‌కి లాక్కెళ్ళి, రెండు మూడు రోజులు లాకప్‌లో పెట్టి, నాలుగు తన్ని, నిజాన్నంతా వాడిచేత కక్కించారు. తరువాత ఆటోవాడి ఇల్లు సోదా చెయ్యగా మీనా పెట్టె, సామాన్లు, నగలూ దొరికాయి.

స్టేషన్ నుంచి తీసుకెళ్తూ, ఆటోవాడు అడవిలో మీనాని రేప్ చేసి, చంపి, పాతిపెట్టిన జాగాకి వెళ్ళి తవ్వించి ఆమె ఎముకల్ని మాత్రం తీసుకొచ్చి దహనసంస్కారాలు చేస్తున్న అనిల్ వైపు స్నేహితులు, కపూర్ జాలిగా చూసారు.

దేశంలో జరుగుతున్న అన్యాయాల్ని రోజూ వింటూ, పేపర్లలో చదువుతూ కూడా మీనాని ఎంత అపార్థం చేసుకున్నాను! కపూర్ ఈ నిజాన్ని బయటకి కక్కించి వుండకపోతే మీనా పట్ల అనుమానాన్ని పెంచుకుంటూ, జీవితాంతం అసహ్యించుకుంటూనే వుండేవాడిని కదా?!" అని బాధపడుతూ పశ్చాత్తాపంతో కుంగిపోతూ, ఎదురుగా వున్న అత్తమామల వైపు చూడలేక, బాధని అణచుకోలేక కుళ్ళి కుళ్ళి ఏడవసాగాడు అనిల్.

- కాకతీయ సావనీర్‌లో జనవరి **1992**
***AIR*, 10-7-90**